సాక్షి ప్రకాశం

గురువారం । 22 । ఆగస్టు । 2024



చిరుద్యోగులకు వేతన వెతలు

ప్రభుత్వాస్పత్రుల నిర్వహణను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం ఆస్పత్రుల్లో పనిచేసే ఔట్‌సోర్సింగ్ పారిశుద్ధ్య సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వడం లేదు.

- 8లో..



అర్హులైన గిరిజనులకు పథకాలు అందాలి

అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు అందాలని కలెక్టర్ అన్నారు.

- 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36.9/28.9

ఎండ తీవ్రత పెరుగుతుంది. వాతావరణం ఉక్కపోతగా ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల కంప్యూటరీకరణ

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: జిల్లాలోని 93 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు అక్టోబర్ రెండు నాటికి పూర్తి స్థాయి కంప్యూటరీకరణ చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవన్‌లో బుధవారం జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలసి సహకార శాఖపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సహకార శాఖ పనితీరు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పరిధిలోని గోదాములను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవటం, కౌలు రైతులకు మంజూరు, ఎరువుల పంపిణీ తదితర అంశాలపై సమీక్షించారు. పీడీసీసీ బ్యాంకుకు సంబంధించిన ప్రతి మండలంలోనూ బ్రాంచిలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సహకార అధికారి బి.శ్రీనివాస రెడ్డి, కోఆపరేటివ్ ఆడిట్ అధికారి రాజశేఖర్, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాస రావు, నాబార్డ్ డీడీ ఎం రవికుమార్, పీడీసీసీ బ్యాంకు సీఈఓ కోటిరెడ్డి, మత్స్యశాఖ సహాయ సంచాలకులు ఉషారాణి, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల భద్రతపై అప్రమత్తంగా ఉండాలి

- రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తిన పద్మావతి



సూచనలు చేస్తున్న రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తిన పద్మావతి

ఒంగోలు సెంట్రల్: విద్యార్థినులకు అందిస్తున్న మెనూ, భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు వహించి, అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తిన పద్మావతి అన్నారు. చీమకుర్తి మండలంలోని ఏపీ అంబేడ్కర్ బాలిక గురుకుల పాఠశాలను, ప్రభుత్వ పాఠశాలను, గాంధీ నగర్, నెహ్రూ నగర్, అంబేడ్కర్ నగర్‌లలోని అంగన్‌వాడీ కేంద్రాలను, సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలికల వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకుల పాఠశాలలో ఆహారాన్ని వృథా చేయటాన్ని, మంచినీటి ఇబ్బందులను, బాలికల్లో రక్త హీనతకు గుర్తించారు. డీఎంహెచ్‌ఓకు ఫోన్ చేసి వైద్యశిబిరం నిర్వహించాలని కోరారు. చీమకుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకంలో పలు లోపాలు గుర్తించారు. కమిటీలు ఏర్పాటు చేసి నోటీస్ బోర్డులో పెట్టాలని, కోడిగుడ్లను విద్యార్థులకు సక్రమంగా ఇవ్వాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులు లేకుండా అటెండెన్స్ వేస్తుండటం గుర్తించారు. బాలికల వసతి గృహంలో పాములు వస్తున్నట్లు బాలికలు చెప్పారు. గదులు శుభ్రంగా లేకపోవటం, ఒకే కొళాయి ఉండటం, మరుగుదొడ్లు సక్రమంగా లేకపోవటం, తాగేందుకు, వంటకు ఒకే నీరు ఉపయోగించటం వంటి లోపాలు గమనించారు. హాస్టల్ అధికారులు అందుబాటులో లేకపోవటంతో పాటు లోపాలను తక్షణం సరిదిద్దాలని జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి లక్ష్మానాయక్‌కు ఫోన్‌లో తెలిపారు. బాలల విషయంలో సమస్యలు ఏవైనా ఉంటే 1098కు కాల్ చేయాలని కోరారు. ఆయా కార్యక్రమాలలో మున్సిపల్ చైర్ పర్సన్ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ రాఘవేంద్ర, ఎంఈఓ శివాజీ, డీవీసీ నరసింహారావు, బాలల సంక్షేమ కమిటీ సభ్యులు నీలిమ, వంశీలత, లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ బీ రత్న ప్రసాద్, వీరాంజనేయులు, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, ఎంఎస్‌కే కోటేశ్వరి పాల్గొన్నారు.



ఎమ్మెల్యేలు.. డమ్మీలు

- పదవులుండి పెత్తనం చేయలేని నిస్సహాయులు
- చినబాబు అండ్ కో ఆజ్ఞ లేనిదే చిన్న బదిలీ కూడా జరగదు
- షాడో ఎమ్మెల్యేలుగా పచ్చ మీడియా ప్రతినిధులు
- వీరు ఆమోద ముద్ర వేస్తేనే పోస్టింగ్‌లకు క్లియరెన్స్
- సీఐ, ఎస్ఐ పోస్టింగ్‌లపై ఎమ్మెల్యే సిఫార్సులు పెండింగ్‌లో
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి రిక్తహస్తాలు
- జిల్లాలోని పలు సర్కిళ్లలో ఖాళీగా సీఐ, ఎస్ఐ పోస్టులు

కూటమి ఎమ్మెల్యేలు డమ్మీలు. నియోజకవర్గ స్థాయిలో పెత్తనమంతా చిన్నబాబు లోకేష్.. ఆయన అనుచరులదే. పచ్చమీడియా ప్రతినిధులే షాడో ఎమ్మెల్యేలు. వీరు సిఫార్సు చేస్తేనే కానిస్టేబుల్ నుంచి ఎస్పీల వరకు.. బిల్ కలెక్టర్ నుంచి కలెక్టర్ వరకు పోస్టింగ్ లు ఇస్తున్న పరిస్థితి. చిన్నబాబు ఆజ్ఞ లేనిదే చిన్న పోస్టింగ్ కూడా ఇవ్వలేమని ఉన్నతాధికారులు తెగేసి చెబుతున్నారు. చిన్న పోస్టింగ్ కూడా వేయించుకునే శక్తి లేక ఎమ్మెల్యేలు నిస్సహాయత ప్రదర్శిస్తున్నారు. జిల్లాలో కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెంలో సీఐ, ఎస్ఐ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

సాక్షిప్రతినిధి, ఒంగోలు:

అధికారంలోకి వచ్చాక తమ అధికార దర్పాన్ని ప్రదర్శిద్దామని కలలు కన్న ఎమ్మెల్యేలు డమ్మీలయ్యారు. ఏది చేయాలన్నా చిన్నబాబు టీమ్ అనుమతి కావాల్సిందే. జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి అధికారులు సైతం అక్కడి నుంచి క్లియరెన్స్ రావాలంటూ ఎమ్మెల్యేలకు ఓపెన్‌గా చెప్పేస్తున్నారు. దీంతో చిన్నబాబును కలిసి చెప్పలేక, పనులు కాక, ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. చివరకు సీఐ, ఎస్సై పోస్టింగ్‌లలో సైతం తాము చెప్పిన వారికి వేయించుకోలేని దుస్థితిలో ఉన్నామంటూ కూటమి ఎమ్మెల్యేలు తమ అనుయాయుల వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిసింది. పోలీసు పోస్టింగ్‌లు ఏవైనా చిన్నబాబు లోకేష్ టీమ్ చెక్ చేసి ఓకే అంటేనే పోస్టింగ్‌లు వేసేలా ఐజీ, ఎస్పీలకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయన్నది బహిరంగ రహస్యం. మంత్రులు, ఎమ్మెల్యేలు కలిసి అభ్యర్థించినా అక్కడి నుంచి ఆమోదం రానిదే పోస్టింగ్‌లు వేయలేమంటూ తెగేసి చెబుతున్నారు. కొందరు ఎమ్మెల్యేలు అయితే మంత్రులు, జిల్లా ముఖ్యనేతలతో సహా ఉన్నతాధికారులకు చెప్పించినా చివరకు డీజీపీని కలిసి అభ్యర్థించినా ఫలితం లేకపోవడంతో కొత్త పేర్లు ఇవ్వకుండా అలిగి కూర్చున్నట్లు సమాచారం. ఎమ్మెల్యేలు అలిగినా, ఆగ్రహించినా చిన్నబాబు టీమ్ మాత్రం డోంట్ కేర్ అంటోంది. ఆంధ్రజ్యోతి, ఈనాడు రిపోర్టర్లు, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు, యువగళం పాదయాత్రలో పాల్గొన్న టీడీపీ యువనేతలతో పోలీసు అధికారుల గురించి సమాచారం తెప్పించుకుని దాని ప్రకారం మాత్రమే క్లియరెన్స్ ఇస్తున్న పరిస్థితి. దీంతో టీడీపీ సామాజికవర్గం మినహా ఎస్సై పోస్టింగ్‌లు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన పోలీసు అధికారులకు దక్కక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఎమ్మెల్యేల లిస్టుకు నో..

జిల్లాలో కనిగిరి, మార్కాపురం, గిద్దలూరు, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఎస్సై, సీఐ పోస్టింగ్‌లు వేయించుకోలేని నిస్సహాయ పరిస్థితి నెలకొంది. ఎమ్మెల్యేలంతా సీఐ, ఎస్సై పోస్టింగ్‌లకు తమకు కావాల్సిన వారికి ఇవ్వమని లిస్టు పంపినప్పటికీ చిన్నబాబు టీమ్ పరిశీలనకు వెళ్లినట్లు సమాచారం. దీంతో అక్కడి నుంచి క్లియరెన్స్ రాని సీఐ, ఎస్సైలకు ఇప్పటికీ పోస్టింగ్‌లు దక్కలేదు. రెండు దఫాలుగా మార్చి కొత్తపేర్లు ఇచ్చినప్పటికీ వాళ్లు కూడా మన పార్టీకి సంబంధించిన వారు కాదంటూ చిన్నబాబు టీమ్ అడ్డుపుల్ల వేశారు. జిల్లాలో కనిగిరి, పామూరు, మార్కాపురం, కంభం, యర్రగొండపాలెం, త్రిపురాంతకం తదితర సర్కిల్‌లకు సీఐల పేర్లు ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు పంపినప్పటికీ వారికి ఇవ్వడం కుదరదంటూ చిన్నబాబు టీమ్ నిరాకరించినట్లు సమాచారం. దీంతో అక్కడి నుంచి క్లియరెన్స్ రానిదే పోస్టింగ్‌లు ఇవ్వమంటూ పోలీసు ఉన్నతాధికారులు సైతం చేతులెత్తేస్తున్న పరిస్థితి. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి రెండున్నర నెలలు దాటుతున్నా సీఐ, ఎస్సై పోస్టింగ్‌లు కూడా వేయించుకోలేకపోతున్నామని, గతంలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి తాము చూడలేదంటూ ఎమ్మెల్యేలు మనోవేదన చెందుతున్నట్లు తెలిసింది. ఆయా జిల్లాల మంత్రులు సిఫార్సు చేసినా ఫలితం లేకపోవడంతో ఇక తమగోడు ఎవరికి చెప్పుకోవాలంటూ ఎమ్మెల్యేలు అలిగి కూర్చున్నట్లు తెలిసింది. తాము చెప్పిన వారికి పోస్టింగ్ వేయకపోతే ఇక కొత్త పేరు చెప్పేది లేదంటూ ఎమ్మెల్యే భీష్మించి కూర్చోవడంతో ఇప్పటికీ జిల్లాలో సీఐ, ఎస్సై పోస్టింగ్‌లు ఇవ్వకుండా పాతవారినే కొనసాగిస్తున్న పరిస్థితి. టీడీపీకి పూర్తి అనుకూలంగా ఉన్నవారికి మాత్రమే పోస్టింగ్ ఇవ్వాలనేది చిన్నబాబు టీమ్ ప్రతిపాదనగా ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో పోస్టింగ్‌లు చేసిన పోలీసు అధికారులకు ఎమ్మెల్యేలు అంగీకరించినా పోస్టింగ్ ఇచ్చే సమస్యే లేదని లోకేష్ టీమ్ మోకాలడ్డుతోంది. ఇదే పరిస్థితి రాష్ట్రవ్యాప్తంగా ఉన్నట్లు చెబుతున్నారు. దీంతో చిన్నబాబు టీమ్, ఎమ్మెల్యేల మధ్య అంతర్యుద్ధం నడుస్తున్నట్లు టీడీపీ వర్గాలు చెబుతున్నాయి. ఇది ఎటు దారితీస్తుందోననే ఆందోళన టీడీపీ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలే లక్ష్యం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా
- జిల్లాలో సాగు, ప్రకృతి వ్యవసాయ స్థితిగతులపై సమీక్ష

ఒంగోలు సెంట్రల్: వ్యవసాయ ఉత్పత్తుల పెంపుదలే లక్ష్యంగా క్షేత్ర స్థాయిలో అధికారులు పనిచేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. ప్రకాశం భవన్‌లో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణతో కలిసి బుధవారం వ్యవసాయ శాఖపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. జిల్లాలో సాగు, ప్రకృతి వ్యవసాయ స్థితిగతులు, జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ద్వారా రైతులకు అందిస్తున్న సేవలను సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ–పంట నమోదు, కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల పంపిణీ ఎలాంటి పొరపాట్లు లేకుండా వేగవంతం చేయాలన్నారు. రైతు సేవా కేంద్రాల ద్వారా గ్రామస్థాయిలో రైతులకు సిబ్బంది అందిస్తున్న సేవలను మండల స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని ఆదేశించారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరాలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదని అధికారులకు స్పష్టం చేశారు. ఇంటిగ్రేటెడ్ అగ్రీ ల్యాబ్స్ ద్వారా అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. వచ్చే ఐదేళ్లలో జిల్లాలో వ్యవసాయ రంగం ఏ విధమైన అభివృద్ధి సాధించాలో మండలాల వారీగా విజన్ డాక్యుమెంట్ రూపొందించాలని ఆదేశించారు. భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగించకుండా రైతులకు తగిన అవగాహన కల్పించాలని కోరారు. ప్రకృతి సేద్యం పెరిగేలా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణి, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, డీఆర్‌సీ అధికారులు, జిల్లాలోని వ్యవసాయశాఖ ఏడీలు, ఏవోలు పాల్గొన్నారు.



జిల్లా వ్యవసాయ శాఖ సమీక్షలో పాల్గొన్న అధికారులు

వెలిగొండ కోసం చిత్తశుద్ధితో పనిచేశాం

- పునాది వేసింది వైఎస్సార్... పూర్తిచేసింది వైఎస్ జగన్
- దానిని టీడీపీ చేసినట్లు చెప్పుకోవడం ఆ పార్టీ దిగజారుడుతనమే
- ఈవీఎంలపై మొదటి నుంచి అనుమానం వ్యక్తం చేస్తూనే ఉన్నాం
- మీడియాతో ఎంపీ వైవీ సుబ్బారెడ్డి



మీడియాతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు: వెలిగొండ ప్రాజెక్టు కోసం చిత్తశుద్ధితో కృషిచేసిన ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక తన నివాసంలో మంగళవారం తనను కలిసిన మీడియాతో ఆయన మాట్లాడారు. 2014–19 వరకు వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం ఎంత ఖర్చుపెట్టింది, తమ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంత ఖర్చుపెట్టింది, ఎన్ని కిలోమీటర్లు సొరంగాలు తవ్వింది ప్రజలందరికీ తెలుసన్నారు. చిత్తశుద్ధితో పనిచేశాం కాబట్టే రెండు సొరంగాలతో పాటు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం కూడా పూర్తిచేశామన్నారు. అప్పట్లో కృష్ణా బేసిన్‌లో నీరు లేనందున నీరు విడుదల చేయలేకపోయామని, అందువల్లే తాము టన్నెల్‌లు పూర్తిచేసి, రెగ్యులేటర్ కూడా పూర్తిచేయబట్టే దానిని జాతికి అంకితం చేసినట్లు చెప్పారు. కానీ నేడు టీడీపీ నాయకులు దానిని సైతం వారే పూర్తిచేసుకున్నట్లు చెప్పుకోవడం దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. వెలిగొండ ప్రాజెక్టుకు పునాది వేసింది వైఎస్సార్ అయితే దానిని పూర్తిచేసింది వారి తనయుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అన్నారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్లపై అనేక అనుమానాలు తలెత్తాయన్నారు. ఈవీఎంలు హ్యాక్ చేయవచ్చనే పరిస్థితులు కనిపిస్తున్నాయని చెప్పారు. 2019 ఎన్నికల్లో ఓటమిపాలైనప్పుడు చంద్రబాబు నాయుడు కూడా ఈవీఎంలపై ఇవే అనుమానాలు వ్యక్తం చేశారన్నారు. ఈ నేపథ్యంలో ఎవరికైనా వాటిపై అభ్యంతరాలు వ్యక్తం చేసే హక్కు ఉంటుందని, వారు ఈవీఎంలపై తమకు ఉన్న సందేహాలను సవాల్ చేసుకో వచ్చన్నారు. అందులో భాగంగానే ప్రస్తుతం ఎన్నికల కమిషన్‌కు డిపాజిట్ చేసి మరీ సవాల్ చేసినట్లు చెప్పారు. కోర్టు సూచనల మేరకు తప్పకుండా ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌కు ఉందన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలు అలా లేవంటూ ఎన్నికల కమిషన్ తాజాగా చెబుతోందని, ఈ నేపథ్యంలో న్యాయస్థానం దీనిపై స్పష్టత ఇస్తుందని భావిస్తున్నామన్నారు. ఈవీఎంలలో ఏవైనా మతలబు ఉంటే మేము కూడా నిగ్గుతేల్చాలని కోరతామని వైవీ సుబ్బారెడ్డి పేర్కొన్నారు.

ఉద్యమంలా భూగర్భ జలాల సంరక్షణ



నీటివనరులు సంరక్షణపై భూగర్భ, డ్వామా, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

ఒంగోలు సెంట్రల్: భూగర్భ జల వనరులను కాపాడుకోవటం, నీటి మట్టం పెంచటం ఒక ఉద్యమంలా చేపట్టాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. భూగర్భ జలాలు పొదుపుగా వినియోగించుకోవటం, వాన నీటిని ఒడిసిపట్టి స్థానికంగా భూమిలో ఇంకేలా చర్యలు తీసుకోవటంపై సంబంధిత శాఖ అధికారులతో బుధవారం కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా మాట్లాడుతూ నీటిని పొదుపుగా వినియోగించటంపై ప్రజలను చైతన్యపరచాలని ఆదేశించారు. చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, ఫాం పాండ్స్, కందకాలు, ఇంకుడు గుంతల తవ్వకం, వాల్టా చట్టం పకడ్బందీగా అమలు చేయటంపై అధికారులతో సమీక్షించారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయిందని, అధిక నీటి వినియోగం దీనికి కారణమని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అధికంగా భూగర్భ జలాలు వినియోగించకుండా స్థానికంగా ఉన్న నీటి లభ్యత ఆధారంగానే పంటలు సాగు చేసేలా రైతులకు అవగాహన కల్పించాలని దిశానిర్దేశం చేశారు. వ్యక్తిగతంగా, సామూహికంగా ఇంకుడు గుంతలు తవ్వుకునేలా ప్రజలను ప్రోత్సహించాలని కలెక్టర్ కోరారు. ఈనెల 23న నిర్వహించే గ్రామ సభల్లో ప్రజలతో చర్చించి స్థానిక అవసరాలకు తగినట్లుగా ఉపాధి హామీ పనులు చేపట్టాలని ఆదేశించారు. ఈ పనులు చేపట్టడంతో భూగర్భ జల వనరులు, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఎంఐపీ, ఉద్యాన, వ్యవసాయ, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. నీటి వనరుల ఉపయోగం, పొదుపు గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, స్వచ్ఛంద సంస్థల సహకారంతో జిల్లాలో భూగర్భ జల వనరుల సంరక్షణ ఉద్యమ స్థాయిలో ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. కార్యక్రమంలో భూగర్భ జల వనరుల అధికారి విద్యాసాగర్, డ్వామా పీడీ అర్జున్ రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, డీఆర్ డీఏ పీడీ వసుంధర, జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉద్యాన శాఖాధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ పీవీ రమణ, ఇరిగేషన్ డిప్యూటీ ఎస్ఈ ఎం రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బంద్ ప్రశాంతం

- వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ప్రకటన

ఒంగోలు టౌన్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ దేశవ్యాప్త భారత్ బంద్‌లో భాగంగా ఒంగోలులో నిర్వహించిన బంద్ పూర్తిగా ప్రశాంతంగా విజయవంతమైందని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య అన్నారు. వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ బంద్‌లో భాగంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, వ్యాపార సంస్థలు, దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పోస్టాఫీసులు మూసివేసినట్లు, ఆర్టీసీ బస్సులు నిలిపివేసినట్లు చెన్నయ్య తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులు, ఆర్టీసీ, రెవెన్యూ సిబ్బంది బంద్‌కు మద్దతు ప్రకటించారన్నారు. సుప్రీం కోర్టు తీర్పు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, అందుకే తాము తీర్పును వ్యతిరేకిస్తున్నట్లు స్పష్టం చేశారు. బీజేపీ, తెలుగుదేశం పార్టీల్లోని మాలలు బయటకు వచ్చి పోరాడాల్సిన పరిస్థితిని కల్పించారని విమర్శించారు. మందకృష్ణ మాదిగను పావులాగా వాడుకొని దళితుల మధ్య చిచ్చు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది దళిత వ్యతిరేక తీర్పు అని వ్యాఖ్యానించారు. బంద్‌లో మాల మహానాడు వైస్ ప్రసిడెంట్ బత్తుల వెంకటరావు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, సీహెచ్ గురవయ్య, బి.వెంకటరావు, బడుగు శశి కుమార్, వందనం, అంజయ్య పాల్గొన్నారు.

న్యాయం కోసమే మా పోరాటం:

న్యాయం కోసమే మేము పోరాటం చేస్తున్నామని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా వసంతరావు చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును వ్యతిరేకిస్తూ నిర్వహించిన భారత్ బంద్‌లో ఆయన మాట్లాడారు. సాయంత్రం ఆర్టీసీ బస్సులను అడ్డుకొని కాసేపు ధర్నాకు దిగారు. సుమారు అరగంట పాటు జరిగిన ధర్నాతో ట్రాఫిక్ స్తంభించింది. కార్యక్రమంలో నగర అధ్యక్షుడు నాగార్జున, గడ్డం శ్రీను, కొప్పుల రాజశేఖర్, రమేష్, రామాంజి, రమణ, సురేష్, ఆనంద్, నరహరి, చందు తదితరులు పాల్గొన్నారు.

భారీగా పోలీసు బందోబస్తు:

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వివిధ దళిత సంఘాలు ఇచ్చిన భారత్ బంద్ పిలుపు నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. జిల్లా వ్యాప్తంగా పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. తెల్లవారుజాము నుంచే అన్ని ప్రధాన రహదారులపై, కూడళ్లలో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల వద్ద, ప్రభుత్వ కార్యాలయాల వద్ద పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశారు.



బస్సులను అడ్డుకున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా వసంతరావు



నగరంలో బంద్ నిర్వహిస్తున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య

తూమాడు సచివాలయానికి పచ్చరంగు

జరుగుమల్లి (సింగరాయకొండ): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తెలుగుదేశం పార్టీ నేతలు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతలపై దాడులకు పాల్పడటమే కాకుండా పలుచోట్ల ప్రభుత్వ భవనాల శిలాఫలకాలను ధ్వంసం చేశారు. అధికారం ఉందికదా మమ్మల్ని ఏం చేస్తారన్న అహంకారంతో ఇష్టారీతిగా వ్యవహరిస్తున్నారు. ఈక్రమంలో జరుగుమల్లి మండలం తూమాడు గ్రామ సచివాలయం ప్రహరీకి గ్రామ టీడీపీ నాయకుడు పచ్చరంగు వేశాడు. గత నెల 28వ తేదీ ఆదివారం సెలవు రోజు కావడంతో సచివాలయ సిబ్బంది ఎవరూ లేని సమయంలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఒకరు ప్రహరీకి పచ్చరంగు వేశాడు. ఇది స్థానికంగా వివాదం రేపింది. సోమవారం విధులకు వచ్చిన సచివాలయ సిబ్బంది ప్రహరీకి వేసిన పచ్చరంగును చూసి విస్తుపోయారు. వెంటనే ఈ సమాచారాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రభుత్వ భవనానికి రంగులు ఎలా వేస్తారని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు.



పచ్చరంగు వేసిన తూమాడు సచివాలయం

క్లుప్తంగా

ఎయిర్‌పోర్టుకు భూములు పరిశీలించిన జేసీ



భూముల మ్యాప్‌లు పరిశీలిస్తున్న జేసీ గోపాలకృష్ణ

కొత్తపట్నం: ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమైన భూములను జేసీ ఆర్.గోపాలకృష్ణ బుధవారం పరిశీలించారు. కొత్తపట్నం మండలంలోని ఆలూరు, అల్లూరు రెవెన్యూ పరిధిలో భూములను, వాటిని మ్యాప్‌ను పరిశీలించారు. ప్రభుత్వ భూములు, రైతులకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పొలాలపై ఆరా తీశారు. వాన్‌పిక్ భూములు 2,700 ఎకరాలు ఉండగా, అందులో సుమారు 550 ఎకరాలు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అవసరమని అన్నారు. ఆలూరు, అల్లూరు రెవెన్యూ పరిధిలో కొన్ని పంట పొలాలు కూడా ఉన్నాయని, ఆ వివరాలను ఉన్నతాధికారులకు పంపిస్తామని జేసీ తెలిపారు. కార్యక్రమంలో కొత్తపట్నం తహసీల్దార్ పిన్నిక మధుసూదన్‌రావు, డీటీ అర్జున్‌రెడ్డి, సర్వేయర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులోకి హిమోఫోలియా ఇంజక్షన్



హిమోఫోలియాకు చికిత్స చేస్తున్న డాక్టర్ శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ సావిత్రి

మార్కాపురం: మార్కాపురం జీజీహెచ్‌లో హిమోఫోలియా వ్యాధికి ఇంజక్షన్ అందుబాటులో ఉందని జీజీహెచ్ సూపరింటెండెంట్ పి.సావిత్రి తెలిపారు. జీజీహెచ్‌లోని పీడియాట్రీషియన్ ఈ ఇంజక్షన్ వేస్తారని చెప్పారు. ప్రొఫెసర్ డాక్టర్ శ్రీనివాసరావు ఇంజక్షన్‌ను అందుబాటులోకి తెచ్చారని వెల్లడించారు. మార్కాపురం మండలంలోని గజ్జలకొండ గ్రామానికి చెందిన వర్షిత్‌కు హిమోఫోలియా వ్యాధి ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ వ్యాధి చాలా అరుదైనదని, వారసత్వంగా జన్యుపరమైన లోపంతో వస్తుందని వివరించారు. ఈ వ్యాధి నివారణకు వేసే ఇంజక్షన్లు చాలా ఖరీదైనవని, అలాంటి ఇంజక్షన్ మార్కాపురం జీజీహెచ్‌లో అందుబాటులో ఉందని సూపరింటెండెంట్ సావిత్రి తెలిపారు.

మేత భూమి వదిలేయాలని గొర్రెలతో నిరసన



గొర్రెలతో వినూత్న నిరసన తెలుపుతున్న రైతులు

వెలిగండ్ల: ప్రభుత్వ భూములపై టీడీపీ నాయకుల కన్ను పడింది. వెలిగండ్ల పంచాయతీలో సుమారు 120 ఎకరాల భూమి ఉంది. పూర్వం నుంచి పశువులు, గొర్రెలు, మేకలకు మేత కోసం ఆ భూమిని రెవెన్యూ అధికారులు వదిలేశారు. కానీ ఇటీవల కొందరు టీడీపీ నాయకులు ఆ భూమిలో కొంత భాగం బాగుచేసేందుకు ప్రయత్నించారు. దీంతో పశువులు, గొర్రెల యజమానులు మేతకోసం భూమిని వదిలేయాలని కోరుతూ బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయం ఎదుట గొర్రెలతో వినూత్నంగా నిరసన తెలిపారు. తమ గోడును వినిపించుకునేందుకు కార్యాలయం వద్దకు వెళ్లగా తహసీల్దార్ గానీ, ఇతర రెవెన్యూ సిబ్బంది గానీ అందుబాటులో లేరు. దీంతో కొంతసేపు ఎదురుచూసిన రైతులు తిరిగి వెళ్లిపోయారు. నిరసనలో పెరుగు తిరుపాలు, శింగలరెడ్డి పెద అనంతయ్య, పెరుగు శ్రీను, పందెం అంజయ్య, పెరుగు పెద నాగేశ్వరరావు, పెరుగు చిన నాగేశ్వరరావు, పెరుగు నాగరాజు, శింగలరెడ్డి ఆంజనేయులు పాల్గొన్నారు.

పని సర్దుబాటు పారదర్శకంగా జరగాలి

ఒంగోలు: ఉపాధ్యాయుల పని సర్దుబాటు ప్రక్రియ పూర్తి పారదర్శకంగా జరగాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాకా జనార్దన్‌రెడ్డి, డి.శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఉన్నత పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చేందుకు ప్రస్తుతం జరుగుతున్న పని సర్దుబాటు ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. మండల స్థాయిలో సబ్జెక్టు టీచర్లకు కౌన్సిలింగ్‌తో పాటు సెకండరీ గ్రేడ్ టీచర్ల కౌన్సిలింగ్ కూడా నిర్వహించాలన్నారు. ఆ తర్వాత మాత్రమే డివిజన్ స్థాయిలో కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఎస్‌జీటీ ఉర్దూ పోస్టులు, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులను మినహాయించి సెకండరీ గ్రేడ్ టీచర్లను సర్ ప్లస్‌గా చూపాలన్నారు. మండల, డివిజన్ స్థాయిలో ముందుగా సీనియార్టీ జాబితాలు ప్రదర్శించాలని, వాటిని తయారు చేసే సమయంలో రోస్టర్ కం మెరిట్ విధానంలో రూపొందించాలని కోరారు. 98 కన్నా విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో కనీసం ఐదుగురు సెకండరీ గ్రేడ్ టీచర్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

చిరుద్యోగులకు వేతన వెతలు..!

రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తిగా పక్కన పెట్టేసింది. రెండు నెలలకే ప్రజల నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత మూటగట్టుకుంటోంది. చివరకు పేద ప్రజలకు వైద్యసేవలు అందించాల్సిన ప్రభుత్వాస్పత్రుల నిర్వహణను సైతం గాలికొదిలేసింది. ఆస్పత్రులను పరిశుభ్రంగా ఉంచేందుకు ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల ద్వారా నియమించిన పారిశుధ్య సిబ్బందికి జీతాలు చెల్లించేందుకు కూడా నిధులు విడుదల చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. అరకొరగా ఇచ్చే జీతాలు కూడా ఆరు నెలల నుంచి అందక వారంతా ఆర్థిక ఇబ్బందులతో అవస్థ పడుతున్నారు.

- ప్రభుత్వ వైద్యశాలల్లో పారిశుధ్య సిబ్బందికి ఆరునెలలుగా అందని జీతాలు
- జిల్లాలో సుమారు 180 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది
- ప్రభుత్వం మారిన తర్వాత ఏజెన్సీలకు నిలిచిపోయిన బిల్లులు
- సిబ్బందికి జీతాలు చెల్లించని ఏజెన్సీలు
- గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా బిల్లుల చెల్లింపు
- ఫిబ్రవరి వరకూ జీతాలు అందజేత



కంభం ప్రభుత్వ వైద్యశాలలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది

కంభం: జిల్లాలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఆయా వైద్యశాల స్థాయి, పడకలను బట్టి ఒక్కో వైద్యశాలకు 7 నుంచి 20 మంది వరకు ఔట్ సోర్సింగ్ ద్వారా పారిశుధ్య సిబ్బందిని నియమించారు. ఒంగోలు, మార్కాపురం, కంభం, గిద్దలూరు, దోర్నాల, యర్రగొండపాలెం, పామూరు, కనిగిరి, పొదిలి, కొండపి, చీమకుర్తి వైద్యశాలల్లో సుమారు 150 నుంచి 180 మంది వరకు వీరు పని చేస్తున్నారు. ఆయా వైద్యశాలల్లో కష్టపడి పని చేస్తూ ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచేందుకు తోడ్పడుతున్నారు. వీరికి థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా జీతాలు చెల్లిస్తుంటారు. పారిశుధ్య సిబ్బందికి రూ.12 వేలు, సూపర్‌వైజర్లకు రూ.13,072 చొప్పున జీతాలిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సంబంధిత ఏజెన్సీలకు క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించింది. వాటితో గత ఫిబ్రవరి నెల వరకు పారిశుధ్య సిబ్బందికి ఏజెన్సీల ద్వారా సక్రమంగా జీతాలందాయి. అనంతరం ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పాటు ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి వీరికి వేతన కష్టాలు మొదలయ్యాయి. సీఎంగా చంద్రబాబు బాధ్యతలు చేపట్టి రెండు నెలలు దాటినప్పటికీ.. పరిపాలన గాడిలో పడకపోగా, చివరకు ప్రభుత్వాస్పత్రులపై పర్యవేక్షణ కూడా కరువైంది. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలకు బిల్లులు విడుదల చేయకపోవడంతో ఆస్పత్రుల్లో పారిశుధ్య సిబ్బందికి ఆరు నెలల జీతాలు అందలేదు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా విధులకు హాజరై కష్టపడి పనిచేస్తున్నప్పటికీ జీతాలు చెల్లించకపోవడంపై పారిశుధ్య సిబ్బంది తీవ్రస్థాయిలో అసహనం వ్యక్తం చేస్తున్నారు. వీరు ఒక్కరోజు విధులకు గైర్హాజరైతే వైద్యశాలల్లో పారిశుధ్యం అధ్వానంగా తయారవుతుంది. రోగులకు తీవ్ర అసౌకర్యం కలుగుతుంది. అలాంటి వారిని నిర్లక్ష్యం చేయడంపై ప్రజల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు వినిపిస్తున్నాయి.



వైద్యశాలలో శుభ్రం చేస్తున్న స్వీపర్



కంభం ప్రభుత్వ వైద్యశాల

ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తేనే జీతాలిస్తామంటున్న ఏజెన్సీలు...

థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా వీరికి జీతాలు చెల్లించాల్సి ఉండగా, ఆ ఏజెన్సీల వారు మాత్రం ప్రభుత్వం బిల్లులు విడుదల చేస్తేనే తాము జీతాలు చెల్లించగలమని చెబుతున్నారు. ప్రభుత్వం మాత్రం బిల్లుల చెల్లింపుపై దృష్టి సారిస్తున్న దాఖలాలు లేకపోవడంతో వీరి జీతాల చెల్లింపు మరింత ఆలస్యమయ్యేలా ఉంది. అసలే వచ్చేది అరకొర జీతమని, అది కూడా ఆరు నెలల వరకు ఇవ్వకుంటే తామెలా బతకాలని సిబ్బంది వాపోతున్నారు. కుటుంబాలను పోషించుకోవడం భారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెద్ద పెద్ద ఉద్యోగులే నాలుగు రోజులు జీతం ఆలస్యమైతే నానా హైరానా చేస్తుంటారని, అటువంటిది.. ఆరు నెలలుగా జీతాలు రాకుంటే తమ పరిస్థితి ఎలా ఉంటుందో ప్రభుత్వం అర్థం చేసుకుని వెంటనే తమ జీతాలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

కుటుంబ పోషణ భారంగా మారింది



మాకు జీతాలు సక్రమంగా రాకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిపోతోంది. బయట మార్కెట్లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోతున్నాయి. రెండు నెలలకోసారైనా జీతాలిస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం, అధికారులు స్పందించి మాకు సక్రమంగా జీతాలు అందేలా చూడాలి.

– పెద్దకాశమ్మ, స్వీపర్, కంభం వైద్యశాల

ఆరునెలల జీతాలు రావాలి



మా వైద్యశాలలో ఆరుగురు స్వీపర్లు ఉండగా, నేను సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాను. ఫిబ్రవరి నెల వరకు జీతాలిచ్చారు. మార్చి నెల నుంచి జీతాలు రావాల్సి ఉంది. జీతాలు త్వరగా ఇచ్చేలా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి.

– కె.రామారావు, సూపర్‌వైజర్, కంభం వైద్యశాల

హాజరు మాత్రమే పంపిస్తాం.. జీతాల విషయం మాకు తెలియదు

మా ఆస్పత్రిలో మొత్తం ఏడుగురు పారిశుధ్య సిబ్బంది ఔట్ సోర్సింగ్ ద్వారా పనిచేస్తున్నారు. వారికి సంబంధించిన హాజరు మాత్రమే వేసి మేము పైకి పంపిస్తాం. వారికి జీతాలు థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా చెల్లిస్తుంటారు. జీతాల విషయం మాకు తెలియదు.

– డాక్టర్ శివనాయక్, సూపరింటెండెంట్, కంభం ప్రభుత్వ వైద్యశాల

అర్హులైన గిరిజనులకు పథకాలు అందాలి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన గిరిజనులకు పూర్తి స్థాయిలో అందేలా సంబంధిత శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. పీవీటీజీ గిరిజనుల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి జన్ మన్ యోజన కార్యక్రమాన్ని సెప్టెంబర్ మొదటి వారంలో దేశవ్యాప్తంగా వివిధ జిల్లాల్లో నిర్వహించనున్న నేపథ్యంలో బుధవారం ఢిల్లీ నుంచి గిరిజన మంత్రిత్వ శాఖాధికారులు ఆయా జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఒంగోలులోని ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథరావు, ఐటీడీఏ ఏపీఓ సురేష్‌బాబు, పలువురు అధికారులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం ఆయా అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీవీటీజీల జీవన స్థితిగతులు మార్చేలా పథకాలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. అర్హులకు పక్కా గృహాలు నిర్మించడంతో పాటు ఆయా ప్రాంతాల్లో రోడ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, వైద్యం, విద్య, తాగునీరు, విద్యుత్, టెలిఫోన్ నెట్‌వర్క్, తదితర సదుపాయాలు మెరుగుపరచాల్సి ఉందన్నారు. ఆ దిశగా సమగ్రంగా నివేదిక రూపొందించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఈ మెగా ఈవెంట్‌ను దోర్నాలలో నిర్వహించాలని కలెక్టర్ ప్రాథమికంగా నిర్ణయించారు.

సమీక్ష సమావేశంలో గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు, హౌసింగ్ పీడీ పేరయ్య, ఐసీడీఎస్ పీడీ మాధురి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్‌ఆలీ, డీఎంహెచ్ఓ సురేష్‌కుమార్, డిప్యూటీ డీఈఓ సుబ్బారావు, బీఎస్ఎన్ఎల్, పంచాయతీరాజ్, విద్యుత్ శాఖాధికారులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

తాటిపర్తి కుటుంబ సభ్యులను పరామర్శించిన వైవీ



తాటిపర్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు: ఇటీవల అనారోగ్యంతో కన్నుమూసిన కోల్ సొసైటీ మాజీ అధ్యక్షుడు తాటిపర్తి సుబ్బారెడ్డి కుటుంబ సభ్యులను ఎంపీ వైవీ సుబ్బారెడ్డి బుధవారం పరామర్శించారు. ఒంగోలు వచ్చిన వైవీ సుబ్బారెడ్డి తాటిపర్తి సుబ్బారెడ్డి ఇంటికి వెళ్లారు. సుబ్బారెడ్డి మరణానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. సుబ్బారెడ్డితో తనకున్న సంబంధాన్ని గుర్తుచేసుకున్నారు. తాటిపర్తి మరణం తనను ఎంతగానో కలచివేసిందంటూ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వైవీ సుబ్బారెడ్డి వెంట రమణారెడ్డి, వై.వెంకటేశ్వరరావు, రాజశేఖరరెడ్డి తదితరులు ఉన్నారు.

ఘాట్‌రోడ్డులో కూలిన కొండచరియలు



శ్రీశైలం రోడ్డులో విరిగి పడిన కొండచరియలు



దొంగల వాగు పొంగడంతో నిలిచిన వాహనాలు



పెద్దబొమ్మలాపురం గండి చెరువుకు చేరిన వర్షం నీరు

- దొంగలవాగు పొంగడంతో కర్నూల్ రోడ్డులో నిలిచిన వాహనాలు
- అర్ధరాత్రి ఇబ్బందులు పడిన వాహనదారులు

పెద్దదోర్నాల: మండలంలో బుధవారం వేకువజామున భారీ వర్షం కురిసింది. మంగళవారం రాత్రి జల్లులుగా కురుస్తున్న వర్షం బుధవారం వేకువజాము నుంచి ఒక్కసారిగా భారీ వర్షంగా మారింది. దీంతో మండల పరిధిలోని దొంగల వాగు, తీగలేరు, దేవలూడు రాళ్ల వాగులు పొంగడంతో పెద్ద బొమ్మలాపురంలోని గండి చెరువుకు భారీగా నీళ్లు చేరాయి. దీంతో పాటు తీగలేరు పొంగడంతో గంటవానిపల్లె, కడప రాజుపల్లె, చిన్నదోర్నాల తదితర ప్రాంతాలలో నీరు చప్టాలపై ప్రవహించింది. గంటవానిపల్లె చెరువుకు కొద్దిపాటి నీరు చేరింది. భారీ వర్షంతో శ్రీశైలం ఘాట్ రోడ్డులోని కొండ చరియలు విరిగిపడ్డాయి. అయితే ట్రాఫిక్ లేని సమయంలో కొండచరియలు విరిగి పడటంతో పెను ప్రమాదం తప్పింది. కర్నూల్, గుంటూరు రోడ్డులోని దొంగలవాగు పొంగడంలో పలు ప్రాంతాల్లో ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి.

అర్ధరాత్రి ప్రయాణికుల అవస్థలు

దొంగలవాగు పొంగడంలో కర్నూల్, గుంటూరు రోడ్డులోని పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ నిలిచిపోయింది. అర్ధరాత్రి 2 గంటల నుంచి తెల్లవారే వరకు దొంగలవాగు ప్రవహించడంలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ట్రాఫిక్ సమస్యతో రోడ్డుకిరువైపులా భారీ సంఖ్యలో వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నట్టనడివిలో వాహనాలు నిలిచిపోవటంతో ఆయా వాహనాల్లో ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు. ప్రయాణికులు బిక్కుబిక్కుమంటూ రాత్రంతా అటవీ ప్రాంతంలో చిమ్మ చీకట్లోనే గడిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఈ రహదారులపై పర్యవేక్షణను ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

బాల్య వివాహాల నిరోధం భేష్



బాల్య వివాహాల గురించి వివరిస్తున్న అధికారులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సెంట్రల్: జిల్లాలూ మూడేళ్లుగా బాలయ వివాహాలను నిరోధించడంలో అధికారులు కీలక పాత్ర వహించారని, వారి పనితీరును కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా మెచ్చుకున్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో బుధవారం బాల్య వివాహాల నివారణపై మహిళా సంక్షేమ శాఖ, ఎన్‌జీఓ సంస్థలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని వెనకబడిన ప్రాంతాలు, షెడ్యూల్ ట్రైబల్ ఏరియాల్లో ఇంకా బాల్య వివాహాలు జరుగుతున్నాయన్నారు. అందుకు సంబంధించిన కుల, మత, లీగల్ బాల్య వివాహాల నిరోధక అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించి బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించి నిలుపుదల చేయాలని సూచించారు. బాల్యవివాహాలను అడ్డుకోవటంలో ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాధురి, జిల్లా బాలల సంరక్షణ అధికారి పి.దినేష్ కుమార్, ఎస్ఎఆర్ఎస్ ప్రతినిధి సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

రక్షణ కల్పిస్తే మెరుగైన వైద్యసేవలు

- జీజీహెచ్ ఆవరణలో జూనియర్ డాక్టర్ల భారీ ర్యాలీ
- మద్దతు ఇచ్చిన హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు
- సుప్రీంకోర్టు సూచనలపై చర్చలు సఫలమైతే విధులకు వెళతామంటున్న జూడాలు

ఒంగోలు టౌన్:

కోల్‌కత్తా ప్రభుత్వాసుపత్రిలో జరిగిన ఘోరమైన హత్యాచారం లాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రణాళికాబద్ధమైన చర్యలు తీసుకోవాలని ఒంగోలు జూడా అధ్యక్షులు డాక్టర్ అజయ్‌కుమార్ రెడ్డి కోరారు. ఈ కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన సుప్రీంకోర్టు తీసుకుంటున్న చర్యలు సంతృప్తికరంగా ఉన్నాయని చెప్పారు. వైద్యుల భద్రతపై జాతీయ టాస్క్‌ఫోర్స్ వేయడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే శాశ్వత చర్యలను తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం కళాశాల, జీజీహెచ్ పరిసరాలలో జూనియర్ డాక్టర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో వివిధ విభాగాలకు చెందిన హెచ్ఓడీలు, ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు. 300 మందికి పైగా జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు ర్యాలీలో పాల్గొని న్యాయం కోసం నినాదాలు చేశారు. అనంతరం జీజీహెచ్ ఆవరణలోని దీక్షా శిబిరంలో నిరాహార దీక్షను కొనసాగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలలు, కళాశాలలకు చెందిన జూనియర్ వైద్యులకు, వైద్య విద్యార్థులకు , వైద్య వృత్తిలో ఉన్న వారందరికీ భద్రత కల్పించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ప్రజారోగ్యం కోసం అహర్నిశలు పాటుపడుతున్న వైద్యులపై దాడులు, చేయడం, వైద్యశాలలను ధ్వంసం చేయడం లాంటి ఘటనలను అరికట్టాలని, అందుకు ప్రభుత్వాలు పటిష్టమైన చట్టాలు చేయాలని డిమాండ్ చేశారు. స్వేచ్ఛాయుత వాతావరణం ఉన్నప్పుడే వైద్యులు మరింత మెరుగైన వైద్య సేవలను అందించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. జూనియర్ డాక్టర్లు విధుల్లో చేరాలని, కనీసం అత్యవసర వైద్య సేవలను అందించాలని సుప్రీం కోర్టు చేసిన సూచనపై జూడా నాయకులు చర్చలు జరుపుతున్నారని, ఒకవేళ చర్చలు సఫలమైతే విధుల్లో చేరుతామని ఆయన తెలిపారు. కోల్‌కత్తా ఘటన తరువాత కూడా దేశంలోని వివిధ రాష్ట్రాలలో వైద్యరంగంలో పనిచేస్తున్న వారిపై, మహిళలపై అత్యాచారాలు కొనసాగుతూనే ఉన్నాయని, ఇది ఆందోళన కలిగిస్తుందని జూడా వైస్ చైర్మన్ డాక్టర్ శృతి అన్నారు. ఈ ఘటనలకు కారణాలను అన్వేషించి వాటిని నిర్మూలించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వైద్యులపై దాడులను అరికట్టేందుకు చిత్తశుద్ధితో ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల సంఘం నాయకులు చైతన్య సాయి, పి. విష్ణు ప్రియ, అవినాష్ కుమార్, పవిత్ర, రాము, హర్షిత, శివ రామకృష్ణ, నాగేంద్ర, సత్యసాయి, చరణ్, బి. మాధవి తదితరులు పాల్గొన్నారు.



జీజీహెచ్ ఆవరణలో ర్యాలీ నిర్వహిస్తున్న జూడాలు

అనారోగ్యంతో లారీలోనే డ్రైవర్ మృతి



లారీ డ్రైవర్ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శివరామయ్య

మద్దిపాడు: అనారోగ్యంతో లారీలోనే డ్రైవర్ మృతిచెందిన సంఘటన మద్దిపాడు మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌లో బుధవారం చోటుచేసుకుంది. తెలంగాణ రాష్ట్రం భువనగిరి జిల్లా యాదాద్రిలో నివాసం ఉంటున్న కంభం హరి శంకరరెడ్డి(36) ఐషర్ లారీ లోడుతో ఈ నెల 19వ తేదీ హైదరాబాదు నుంచి చెన్నై బయలుదేరాడు. 20వ తేదీ ఉదయం గుండ్లాపల్లి గ్రోత్ సెంటర్‌కు చేరుకుని లారీని రోడ్డు పక్కన ఆపి దగ్గరలోని హోటల్‌లో టిఫిన్ చేశాడు. అనంతరం లారీలో పడుకున్నాడు. 21వ తేదీ కూడా అక్కడి నుంచి లారీ వెళ్లకపోవడంతో స్థానికులకు అనుమానం వచ్చి పరిశీలించగా డ్రైవర్ మృతిచెంది ఉన్నాడు. వెంటనే స్థానిక వీఆర్ఓ అంకమ్మకు ఫోన్ చేసి చెప్పారు. ఆమె పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివరామయ్య సిబ్బందితో కలిసి ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. డ్రైవర్ వివరాలు తెలియడంతో అతని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు బీపీ, షుగర్‌తో బాధపడుతూ కొంతకాలంగా మందులు వాడుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలో గుండెపోటుతో మరణించి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని ఒంగోలు రిమ్స్‌కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఎస్ఐ శివరామయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు గరిష్ట ధర కేజీ రూ.359

ఒంగోలు సెంట్రల్: ఒంగోలు రీజియన్ పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన వేలంలో కేజీ గరిష్ట ధర రూ.359 పలికింది. ఆర్ఎం లక్ష్మణరావు తెలిపిన వివరాల ప్రకారం.. రీజియన్ పరిధిలోని 11 వేలం కేంద్రాల్లో బుధవారం 10,175 బేళ్లు వేలానికి రాగా, 8,703 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 1,472 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. వాటిలో ఒంగోలులోని రెండు కేంద్రాలు, వెల్లంపల్లి, కొండపి, టంగుటూరు వేలం కేంద్రాల్లో 136వ రోజు నిర్వహించిన వేలానికి 5,544 బేళ్లు రాగా, 4,779 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 765 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.359, కనిష్ట ధర రూ.204, సరాసరి ధర రూ.312.79 పలికింది. కందుకూరు–1, 2, కనిగిరి, డీసీ పల్లి, కలిగిరి, పొదిలి తదితర వేలం కేంద్రాల్లో 130వ రోజు నిర్వహించిన వేలానికి 4,631 బేళ్లు రాగా, 3,924 బేళ్లను వ్యాపారులు కొనుగోలు చేశారు. 707 బేళ్లను వివిధ కారణాలతో తిరస్కరించారు. కేజీ గరిష్ట ధర రూ.358, కనిష్ట ధర రూ.204, సరాసరి రూ.306.74 పలికింది.